ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
3★★★ జిల్లా వార్తలు
బుధవారం 12 జూన్ 2024

పెండింగ్ బిల్లులు చెల్లించాలి - 6లో..
ప్రైవేటుకు దీటుగా బోధన - 6లో..



మోగనున్న బడిగంట

నేటి నుంచి పునః ప్రారంభం

- ప్రభుత్వ పాఠశాలల్లో మలిక వసతులు
- అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట అభివృద్ధి పనులు
- తొలి విడత 283 ఎంపిక
- జిల్లాలో 19వ తేదీ వరకు బడిబాట
- 655 పాఠశాలలు 75 వేల మంది విద్యార్థులు


బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

వేసవి సెలవులు ముగిశాయి. దాదాపు రెండు నెలల తర్వాత పాఠశాలలు పున: ప్రారంభమవుతు న్నాయి. ఆటాపాటలతో గడిపిన విద్యార్థులు బుధవారం నుంచి పాఠశాలలకు వెళ్లనున్నారు. ప్రభుత్వం కూడా పాఠశాలల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టిసారించింది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు కొత్త సొబగులు తెచ్చే విధంగా అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టింది. పాఠశాలలు ప్రారంభంలోగా ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందించే దిశగా చర్యలు చేపట్టింది. యూనిఫాం తయారీ బాధ్యతను స్వశక్తి సంఘాల మహిళలకు అప్పగించింది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే వివిధ కార్యక్రమాలు నిర్వహించడానికి షెడ్యూల్ ప్రకటించారు. 5న ప్రారంభమైన బడిబాట కార్యక్రమం 19వ తేదీ వరకు కొనసాగనుంది. ప్రభుత్వ పాఠశాలల ప్రయోజనాలపై ప్రచారం చేసి బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పిస్తున్నారు.

సర్కారు బడికి సొబగులు

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించే దిశగా కొత్త ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా చేపట్టిన పనులు వేగంగా సాగుతు న్నాయి. జిల్లాలో 510పాఠశాలలు ఉండగా తొలి విడత 283 పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.11.80 కోట్లు మంజూరయ్యాయి. 167 పాఠశాలల్లో పనులు పూర్తి చేశారు. 114 పాఠశాలల్లో పనులు చివరి దశలో ఉన్నాయి. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనుల్లో విద్యుత్ సౌకర్యం, తరగతి గదులు, ఫర్నీచర్, నీటి సరఫరా, మరుగుదొడ్లు, తాగునీరు, పేయింటింగ్, మరమ్మతు, బోర్డులు, వంట గదులు, ప్రహరీ, డైనింగ్ హాల్‌లు, డిజిటల్ తరగతులు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. జిల్లాలో తొలి విడతలో బోయినపల్లి మండలంలో 22 పాఠశాలలు, చందుర్తి 23, ఇల్లంతకుంట 23, గంభీరావుపేట 21, కోనరావుపేట 30, ముస్తాబాద్ 25, రుద్రంగి 9, సిరిసిల 22, తంగళ్లపల్లి 32, వీర్నపల్లి 16, వేములవాడ 21, వేములవాడ రూరల్ 13, ఎల్లారెడ్డిపేటలో 26 పాఠశాలల్లో పనులు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్లు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు పనులను పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో 'మన ఊరు, మనబడి, మనబస్తీ' కార్యక్రమం ద్వారా 172 పాఠశాలలను ఎంపిక చేశా రు. ఇందులో భాగంగా తొలివిడత అభివృద్ధి పనులు చేపట్టారు. దీంతోపాటు సీఎస్ఆర్ నిధులతో పాఠశాలలను తీర్చిదిద్దారు. కార్పొరేట్ స్థాయిలో మౌలిక వసతులు కల్పించారు. గంభీరావుపేటలో గతేడాది కేజీ టు పీజీ విద్యా సంస్థల సముదాయాన్ని ప్రారంభించారు. జిల్లా కేంద్రంతోపాటు వివిధ మండలాల్లోని పాఠశాలలు కార్పొరేట్ పాఠశాల లకు దీటుగా నిలుస్తున్నాయి. జిల్లాలోని పాఠశాలలు ఆకర్షించే విధంగా సంస్కృతీసంప్రదాయాలను అద్దంపట్టే విధంగా బస్సు, రైలు బండి, మహనీయుల చిత్రాలతో ఆకర్షణీయంగా తయారు చేస్తున్నారు. దీనికి తోడు అన్ని పాఠశాలల్లో ఆంగ్ల బోధనను అందుబాటులోకి తెచ్చారు. దీంతో విద్యార్థుల సంఖ్య కూడా పెరుగుతూ వస్తోంది.

ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాల దందా

జిల్లాలోని కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాల దందా జోరుగా సాగుతోంది. ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు, ఇతర వస్తువులు విక్రయించవద్దనే నిబంధనలు పట్టించుకోవడం లేదు. పుస్తకాలు, నోట్ బుక్కులు, ఇతర సామగ్రి తీసుకొచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని యాజమాన్యాలు పలు షాపులతో ఒప్పందాలు చేసుకొని అక్కడే పుస్తకాలు కొనుగోలు చేయాలని ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలుస్తోంది.

ఉచిత పుస్తకాలు 2.78 లక్షలు


జిల్లాకు చేరుకున్న పాఠ్యపుస్తకాలు

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు 655 ఉన్నాయి. గత విద్యాసంవత్సరం 75 వేల మంది విద్యార్థులు చదువుకున్నారు. ఇందులో 510 ప్రభుత్వ పాఠశాలల్లో 44,590 మంది విద్యార్థులు, 120 ప్రైవేట్ పాఠశాలల్లో 23,364 మంది ఉన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలు 20 ఉం డగా 7136 మంది చదువుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి 2 లక్షల 78 వేల 711 పుస్తకాలు అవసరం. ఇప్పటి వరకు 2 లక్షల76 వేల 800 పుస్తకాలు వచ్చాయి. వీటిని మండలాలకు పంపించారు. నోటు పుస్తకాలు 2 లక్షల 39 వేల 256 అవసరమవగా పూర్తి స్థాయిలో జిల్లాకు వచ్చాయి. జిల్లాలోని విద్యార్థులకు యూనిఫాం అందించడానికి స్వశక్తి సంఘాల మహిళల ద్వారానే తయారు చేయిస్తున్నారు. 41,680 మంది విద్యార్థులకు యూనిఫాం సిద్ధం చేస్తున్నారు.

ప్రైవేటులో ఫీజుల మోత



ప్రైవేటు పాఠశాలలకు పంపించే మధ్య తరగతి కుటుంబాలను ఫీజుల మోత భయపెడుతోంది. జూన్‌లో ప్రతీ ఇంటా అదనంగా రూ.50 వేల ఖర్చు భారం కానుంది. ఇంజనీరింగ్, ఇంటర్మీడియెట్ ఇతర చదువులకు లక్షల్లోనే ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాలో ప్రైవేటు పాఠశాలల్లో ఎల్‌కేజీ నుంచి పదోతరగతి రూ .15 నుంచి రూ.50 వరకు చెల్లించాల్సి వస్తుంది. దీనికి తోడుగా బస్ రవాణా ఛార్జీలు, ఇతర వర్క్‌బుక్‌లు, స్కూల్‌లో ఇతర యాక్టివిటీస్ ఫీజులతో మధ్య తరగతి కుటుంబాలు అల్లాడుతున్నాయి.

నేడు సినారె వర్ధంతి



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

అక్షర శిఖరం.. సాహితీ విశ్వంభరుడు.. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి. భౌతికంగా లేకపోయినా ఆయన అక్షరం తెలుగు ప్రజలను పలక రిస్తూనే ఉంది. పాటలు మదిని తాకు తూనే ఉన్నాయి. సాహితీ వేత్తలు, అభి మానులు, కవులు, రచయితలు, సినారెతో ఉన్న అనుబంధాలను గుర్తు చేసుకుం టూనే ఉన్నారు. హన్మాజీపేట ముద్దుబిడ్డ డాక్టర్ సి.నారాయణరెడ్డి 87 వసంతాలు అడుగు పెట్టే క్రమంలో జూన్ 12, 2017న అక్షర శిఖరమై నింగికెగిసి ఏడేళ్లు గడి చిపోయాయి. సాహిత్య జీవనదిగా సాగిపోయిన సినారెకు బుధవారం జిల్లాలో కవులు, రచయితలు, సాహితీ సంస్థలు సాహిత్య కార్యక్రమాలతో నివాళులు తెల పడానికి సిద్ధమయ్యారు.

కవితా కర్పూర క్షేత్రంలో సాంస్కృతిక వేడుకలు

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత పద్మభూషణ్ డాక్టర్ సి.నారాయణరెడ్డి వర్ధంతి సందర్భంగా బుధవారం ఆయన స్వగ్రామమైన వేములవాడ మండలం హన్మాజీ పేటలోని కవితా కర్పూర క్షేత్రంలో సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు. ముఖ్య అతిధులుగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, శాతవాహన యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సంకసాల మల్లేష్, ఎన్‌టీవీ తెలుగు సంపాదకుడు డాక్టర్ పత్తిపాక మోహన్‌తోపాటు కవులు, రచయితలు హాజరుకానున్నారు. గాయకుడు దేవతా సుధాకర్ ఆధ్వర్యంలో ప్రపంచ పదులు, గజల్‌లు, సినీగీతాల సాంస్కృతిక వేడుకలు నిర్వహించనున్నారు. దప్పు విన్యాసంతోపాటు సినారె గీతాలాపనపై ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ప్రభుత్వ విప్


సీఎం రేవంత్‌రెడ్డితో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, జూన్ 11 : సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఎంపీగా గెలుపొందిన చెలిమల కిరణ్‌కుమార్‌రెడ్డి, నూతనంగా ఎన్నికైన కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్, ఎమ్మెల్సీగా ఎన్నికైన తీన్మార్ మల్లన్నకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారిని సన్మానించారు.

పాలిస్టర్ అసోసియేషన్ ఎన్నికలు

- అధ్యక్షుడు మినహా ఇతర పదవులు ఏకగ్రీవం

సిరిసిల్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పాలిస్టర్ వస్త్రోత్పత్తిదారుల సంఘం ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ల పర్వం ముగిసింది. మంగళవారం ఉపసంహరణల అనంతరం అధ్యక్ష పదవి మినహా ప్రధాన కార్యదర్శి, ఇతర పదవులు ఏకగ్రీవం అయ్యాయి. ఉపాధ్యక్షుడిగా దూడం రమేష్, ప్రధాన కార్య దర్శిగా అంకారపు రవి, సహాయ కార్యదర్శిగా బండారి అశోక్, కోశాధికారిగా మం డల బాలరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్ష స్థానానికి ఆడెపు భాస్కర్, మోర రాజు బరిలో ఉన్నారు. 14న అధ్యక్ష పదవికి ఎన్నికలు జరగనున్నాయి.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

గంభీరావుపేట, జూన్ 11: ఈ నెల 13న సిరిసిల్లలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎస్సై రాంమోహన్ సూచించారు. గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌లో మంగళవారం మాట్లాడారు. 60 పైగా కంపెనీల సహాయంతో 1000 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్టు వెల్లడిం చారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ ఆపైనా చదివిన నిరుద్యోగులు హాజరుకావాలని పేర్కొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్సై రాంమోహన్ హెచ్చరించారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాల ఇవ్వవద్దని సూచించారు. వాహనాలు నడిపి ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారని, దీనిపై స్పెషల్ డ్రైవ్ కొనసాగుతోందని పేర్కొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి..

తంగళ్లపల్లి, జూన్ 11: స్ట్రీట్ లైట్స్, స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని మండెపల్లి ఎంపీటీసీ బుస్స స్వప్న లింగం కలెక్టర్ అనురాగ్ జయంతికి వినతి పత్రం సమర్పించారు. తంగళ్లపల్లి మండల కేంద్రం నుంచి మండేపల్లి గ్రామానికి వెళ్లే దారిలో ప్రమాద కరమైన మూల మలుపు ఉందని అక్కడ తరుచు ప్రమాదలు జరుగుతూ ఇప్పటికే 8 మంది మృత్యువాత పడ్డారని వినతి పత్రంలో పేర్కొన్నారు. అలాగే తంగళ్లపల్లి నుండి మండేపల్లి గ్రామం మీదుగా కేసీఆర్ నగర్‌వరకు స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎంపీపీ పడిగెల మానస రాజు, ఎంపీటీసీ బుస్స స్వప్న హామీ ఇచ్చారు.

పాలిటెక్నిక్‌తో ఉద్యోగ అవకాశాలు

సిరిసిల్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ డిప్లొమాతో అపారమైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అగ్రహారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజగోపాల్ తెలిపారు. మంగళవారం సిరిసిల్లలో పద్మశాలి అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ ర్యాంకర్లకు ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కంప్యూటర్స్‌పై ఉద్యోగ అవకాశాలు మాత్రమే ఉంటాయని, మిగతా బ్రాంచిలో చదివిన వారు సైతం కంప్యూటర్ ఉద్యోగాల్లో స్థిరపడవచ్చని అన్నారు. వాస్తవికతతో అభిరుచికి అనుగుణంగా కోర్సులను ఎంపిక చేసుకోవాలన్నారు. టెక్స్‌టైల్ డిప్లొమా ఇన్‌చార్జి ప్రభాకర్‌చారి మాట్లాడుతూ సృజనాత్మకతను కోరుకునేవారు టెక్స్‌టైల్ డిప్లొమా కోర్సులను ఎంపిక చేసుకోవచ్చని, టెక్స్‌టైల్ రంగంలో అనేక అవకాశాలు ఉన్నాయని అన్నారు. టెక్స్‌టైల్ డిప్లొమా కోర్సు రాష్ట్రంలో కేవలం అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాలలోనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పొపా ప్రధాన కార్యదర్శి పున్నంచందర్, ఎంఈవో దూస రఘుపతి, గాజుల ప్రతాప్, మచ్చ ఆనందం, వాసాల హరిప్రసాద్, జ్ఞానోబా, తిరుమల, కోడం శ్రీనివాస్, దేవతా ప్రభాకర్ పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే చట్టపరమైన చర్యలు


వివరాలు సేకరిస్తున్న డాక్టర్ రజిత

సిరిసిల్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు స్కానింగ్‌లకు వచ్చిన సందర్భంలో పుట్టబోయే బిడ్డ లింగనిర్ధారణ చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రజిత అన్నారు. మంగళ వారం జిల్లా కేంద్రంలో అల్ట్రా సౌండ్ స్కానింగ్ కేంద్రా లను తనిఖీ చేశారు. స్కానింగ్ కేంద్రాల్లో గర్భిణుల పూర్తి వివరాలను నమోదు చేయాలని, లింగనిర్ధారణ చట్టరీత్యా నేరమని అన్నారు. గర్భిణికి, ఆమె బంధువులకు మాటలు, సైగల ద్వారా ఏ రూపంలో గానీ పుట్టబోయే బిడ్డ వివరాలు వెల్లడించిడం నిషేధమన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన డాక్టర్‌లు, ఇతరులకు రూ.10 వేల జరిమానా, మూడు సంవ త్సరాల జైలు శిక్ష విధించనున్నట్లు చెప్పారు. అన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు చేసి వివరాలు చెప్పాలని అడిగినా ప్రోత్సహించినా వారికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా ఉంటుందన్నారు. డాక్టర్‌కు శిక్షతోపాటు వైద్య పట్టాను కూడా ఐదేళ్లపాటు నిలిపివేస్తారని తెలిపారు. ఈ కార్యక్ర మంలో హెచ్‌ఈ బాలయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం


పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్

సిరిసిల్ల టౌన్, జూన్ 11: ప్రజా సమస్యలను పరిష్క రిస్తూ ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్, సుభాష్‌నగర్, గాంధీనగర్, అంబేద్కర్ నగర్, శాంతినగర్‌ల మీదుగా ప్రవహించే ప్రధాన మురికి కాలువలో పేరుకుపోయిన చెత్తను ఎత్తి వేతను, శిథిలావస్థలో ఉన్న కల్వర్టులను మున్సిపల్ చైర్ పర్సన్, మున్సిపల్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లా డుతూ వర్షకాలం దృష్ట్యా ఎమ్మెల్యే కేటీఆర్ సూచనల మేరకు సిరిసిల్ల పట్టణంలో వరదలతో ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. శిథిలా వస్థలో ఉన్న కల్వర్టుల నిర్మాణం చేపడతామన్నారు. ప్రధాన మురికి కాలువలో పేరుకుపోయిన సీల్ట్‌ను తీయిస్తామన్నారు. సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, మున్సిపల్ డీఈ ప్రసాద్, ఏఈ నరసింహస్వామి పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీకి మరమ్మతు చేయరూ

- చంద్రంపేట వద్ద పైప్‌లైన్‌ల లీకేజీ
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



పైప్‌లైన్ లీకేజీపై స్టాపర్లు

సిరిసిల్ల రూరల్, జూన్ 11 : నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే కరీంనగర్- సిరిసిల్ల ప్రధాన రహదారిపై మంచినీటి పైప్‌లైన్‌ల లీకేజీకి పరిష్కారం లభించడం లేదు. మరమ్మతు చేయక పోవడంతో గుంతలు ఏర్పడి నీటితో నిండు తున్నాయి. తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో వాహనదారులు భయంతో వణికిపోతు న్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేట చౌరస్తాలో కరీంనగర్- సిరిసిల్ల ప్రధాన రహదారితోపాటు కోనరావుపేట మండల కేంద్రానికి వెళ్లేందుకు జంక్షన్ ఉండడంతో వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. చౌరస్తాలో హనుమాన్ దేవాలయం వద్ద పైప్‌లైన్ గేట్ వాల్ రోడ్డుపైనే ఉండడంతో రాకపోకలకు ఇబ్బం దులు ఎదురవుతున్నాయి. ఇటీవల మిషన్ భగీరథ పైప్‌లైన్‌లను వేశారు. ఆ పైప్‌లైన్‌లు సైతం లీకేజీ కావడంతో నీటి గుంతలు ఏర్పడ్డాయి. గుంతల్లో నీళ్లు ఉండడంతో వాహన దారులు చీకటిలో గమనించకుండా గాయపడు తున్నారు. గుంతలకు మరమ్మతు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులతోపాటు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించాలని సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.


చంద్రంపేట చౌరస్తా

గుంతలతో నిత్యం ప్రమాదాలు

- సామల భాస్కర్, సిరిసిల్ల



చంద్రంపేట చౌరస్తాలో ఏర్పడిన గుంతలతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారులు రాత్రి పూట గుంతల్లో పడి గాయపడుతున్నారు. గుంతలను పూడ్చాలి. పైప్‌లైన్ గేట్‌వాల్స్ మూసివేసి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలి.

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు

- వీరగోని శ్రీనివాస్‌గౌడ్, చంద్రంపేట



చంద్రంపేట చౌరస్తాలో పైప్‌లైన్ లీకేజీలతోపాటు భారీ వాహనాల రాకపోకలతో ఏర్పడిన గుంతలతో నిత్యం ప్రమా దాలు జరుగుతున్నాయి. మరమ్మతు చేపట్టాలని ఆర్‌అం డ్‌బీ, మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు.

తాటి చెట్టుపై పిడుగుపాటు


దగ్ధమవుతున్న తాటిచెట్టు

ఎల్లారెడ్డిపేట, జూన్ 11: ఎల్లారెడ్డిపేట మండలంలో మంగళవారం సాయంత్రం మంగళవారం ఉరుములు, మెరు పులతో కూడిన వర్షం కురిసింది. మండలం గొల్లపల్లి గ్రామ శి వారులోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాల వెనుక ప్రాంతంలో తాటి చెట్టుపై పిడుగు పడి మంటలు ఎగిసి పడ్డాయి. అక్కడే కొంత దూరంలోని ఉన్న సంచార జీవులకు త్రుటిలో ప్రమాదం తప్పినట్లయ్యింది. పిడుగు పడడంతో సంచార జీవులు కేకలు వేస్తూ పరుగులు తీశారు. ఎవరికీ ఏమీ జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఎల్లారెడ్డిపేట, జూన్ 11: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఇటీవల వడదెబ్బతో మృతి చెందిన మాదాసు శంకరయ్య కుటుంబానికి ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి సమకూర్చిన నగదును స్థానికులు మంగళవారం అందించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. నాయకులు చింతకింది కిషన్, రాములు తదితరులు ఉన్నారు.

మహిళలు ఆరోగ్యంపై దృష్టి సారించాలి

- బాల వికాస సంస్థ ప్రతినిధి, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ వసంత

జమ్మికుంట, జూన్ 11: మహిళల ఆరోగ్య సంరక్షణకు మెనుస్ట్రువల్ కప్‌లను వాడాలని బాల వికాస సంస్థ ప్రతినిధి, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ దోవారి వసంత అన్నారు. జమ్మికుంటలోని ప్రకాశం కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో ఆమెజాన్ వారి ఆర్థిక సహాయంతో బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో మెనుస్ట్రువల్ కప్‌ల ఉపయోగం, వ్యక్తి గత పరిశుభ్రతపై మహిళలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా 150మంది మహిళలకు మెనుస్ట్రువల్ కప్స్‌ను అందజేశారు. ఆనంతరం దోవారి వసంత మాట్లాడుతూ మానవ మనుగడను శాసించే ఓ సహజ ప్రక్రియ రుతుస్రావం అన్నారు. మహిళలు బాగుంటనే సమాజం ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. మహిళలు నెలసరి సమయంలో ప్యాడ్స్ ఉపయోగించడం వల్ల క్యాన్సర్‌తో పాటు రక రకాల వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. ప్యాడ్స్ భూమిలో కరుగడానికి అనేక సంవత్సరాలు పడుతుందని, ఒకవేల కాల్చితే పర్యవరణ సమస్య తలెత్తుతుందని చెప్పారు. మెనుస్ట్రువల్ కప్స్ ఆరోగ్యానికి ఎంతో మంచివన్నారు. మహిళల ఆరోగ్యం, డబ్బు, పర్యావరణ పరిరక్షణ, సౌకర్యం, ఈ నాలుగు అంశాలను దృష్టిలో పెట్టుకొని మెనుస్ట్రువల్ కప్స్‌ను ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో బాల వికాస సంస్థ సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన, కో-ఆర్డినేటర్ కె సుమలత, ఎ స్వాతి, శాస్త్రవేత్త ప్రశాంతి పాల్గొన్నారు.

మోటార్ల విద్యుత్ తీగల చోరీ

మల్యాల, జూన్ 11: మండలంలోని వరదకాలువకు రైతులు అమర్చుకున్న పంప్‌మోటార్ల విద్యుత్ తీగలు కొన్ని రోజులుగా చోరీకి గురవతున్నాయి. రాంపూర్ నుంచి సర్వాపూర్ శివారుల వరకు వందలాదిగా పంప్‌మోటార్లను అమర్చుకొని రైతులు సాగు చేసుకుంటున్నారు. ఇటీవల సాగు పనులు ప్రారంభం కాగా రెండు రోజులుగా మల్యాల క్రాస్ రోడ్డు ప్రాంతం నుంచి సర్వాపూర్ వరకు గల పంప్‌మోటార్ల విద్యుత్ తీగలను కట్ చేసి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళుతున్నట్లు రైతులు తెలిపారు. గతంలోనూ నూకపల్లి శివారులో విద్యుత్‌తీగలు, పంప్‌మో టార్లలోని కాపర్ తీగలు కూడా చోరీకి గురి కాగ అప్పట్లో కొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల మళ్లీ పెరుగడంతో ఆందోళన చెందుతున్నారు.

గంజాయి కాల్చివేత



గంజాయిని తగులబెడుతున్న పోలీసులు

సిరిసిల్ల క్రైం, జూన్ 11: సిరిసిల్ల పట్టణం రగుడు శివారులోని డంప్ యార్డు వద్ద జిల్లా డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో 36 కిలోల 436 గ్రాముల గంజాయిని కాల్చివేశారు. మంగళవారం రగుడు డంప్‌యార్డువద్దకు జిల్లా వ్యాప్తంగా 41 కేసులలో స్వాధీన పరుచుకున్న 36.436 కిలోల నిషేధిత గంజాయిని ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో శాస్త్రీయ పద్ధతిలో కాల్చేసి బూడిద చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి వంటి మ త్తు పదార్థాలను రవాణాచేసే వారిపై పీడీ యాక్ట్ అమలు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ చంద్రశేఖ రొరెడ్డి, టౌన్ సీఐ రఘుపతి, ఆర్ఐ యాదగిరి పాల్గొన్నారు.

రూ.7,350 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జూన్ 11: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,350 రూపాయలు పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 20మంది రైతులు 275క్వింటాళ్ల విడి పత్తి, ఇద్దరు రైతులు ఒక క్వింటాల్ పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,350, కనిష్ఠ ధర 4,500 రూపాయలు చెల్లించారు.

ఆరెపల్లిలో చోరీ

వేములవాడ టౌన్, జూన్ 11: ఆరెపల్లిలో సోమ వారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆరె పల్లికి చెందిన మంజెడి రాజయ్య తన ఇంటి ముందు నిద్రిస్తున్నాడు. దొంగలు ఇంట్లోకి చొరబడి రూ.15 వేల నగదు, టీవీ, సెల్ ఫోన్ ఎత్తుకెళ్లారు. అదే గ్రామానికి చెందిన నడిగొట్ల లింగయ్యకు చెందిన సెల్‌ఫోన్‌ను, నడిగొట్ల శ్రీనివాస్‌కు చెందిన నీటి పంపును దొంగతనం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు.

200 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

సుల్తానాబాద్, జూన్ 11: సుల్తానాబాద్ మండలం దేవునిపల్లి గ్రామం లో బేడబుడిగె జంగాల కాలనీలోని ఒకరి ఇంట్లో అక్రమంగా నిల్వ చేసి ఉన్న రెండు వందల క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు మంగళవారం పట్టుకున్నారు. గ్రామానికి చెందిన వానరాసి నంబయ్య అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ చేసి ఉంచారన్న సమాచారం మేరకు అధికారులు దేవునిపల్లి గ్రామంలో దాడులు నిర్వహించి బియ్యాన్ని పట్టుకున్నారు. ఈ సందర్భంగా బియ్యం సేకరించే వారు, బుడిగె జంగాల కాలనీ వాసులు అధికారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో సివిల్ సప్లై అధికారులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ శ్రావణ్ కుమార్ పోలీస్ సిబ్బందితో అక్కడికి చేరుకొని అధికారులకు రక్షణ కల్పించారు. దాంతో అధికారులు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకునే కార్యక్రమాన్ని కొనసాగించారు. బియ్యం అక్రమంగా నిల్వ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి అట్టి బియ్యాన్ని సుల్తానాబాద్ లోని ఎం ఎల్ ఎస్ పాయింట్ గోదాముకు తరలించారు. ఈ దాడుల్లో జిల్లా సివిల్ సప్లై అధికారులు ప్రేమ్ కుమార్, పౌరసరఫరాల సంస్థ డిప్యూటీ తహసీల్దారులు శంకర్ , రవీందర్ రాథోడ్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు మల్లికార్జునరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● సైదాపూర్‌లో..

సైదాపూర్: మండలంలోని సర్వాయిపేట గ్రామం నుంచి అక్రమంగా ట్రాలీలో తరలిస్తున్న 10 క్వింటాళ్ల రేషన్ పట్టుకొన్నట్లు ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు. చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన గంట వెంకటేష్ అనే వ్యక్తి మంగళవారం ఉదయం ట్రాలీలో రేషన్ బియ్యం తీసుకొని వెళ్తుడగా పట్టుకొని వాహనాన్ని సీజ్ చేసీ వెంకటేష్‌పై కేసు నమోదు చేశామన్నారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఆరోగ్యం హెచ్చరించారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం

అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయి పట్టివేత

▸▸ మంథని, మద్దులపల్లికి చెందిన ఇద్దరు యువకుల అరెస్టు ▸▸ వివరాలు వెల్లడించిన సీఐ వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

మంథని, జూన్ 11: గంజాయి మత్తుకు బానిసై తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో గంజాయిని క్రమంగా రవాణా చేస్తూ, గట్టుచప్పుడు కాకుండా అమ్మకాలు కొనసాగిస్తున్న ఇద్దరు యువలకును మంథని పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు మంథని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ ఆదేశాల మేరకు.. మంథని బస్ డిపో వద్ద మంథని ఎస్ఐ వెంకటకృష్ణ, సీపీలు దుబ్బాసి రమేష్, ఐతు లుకాలు పెట్రోలింగ్ చేస్తుండగా ఉదయం 11 గంటల సమయంలో డిపో చౌరస్తాలో ప్లాస్టిక్ బ్యాగ్‌తో సహా ఉండి అనుమానాస్పదంగా ఉన్న క్రమంలో యువకులను అదుపులోకి తీసుకొని తహసీల్దార్ ద్వారా పంచానామా నిర్వహించి బ్యాగ్‌లో ఉన్న గంజాయిని తూకం వేయించగా 1కిలో 70 గ్రాములు ఉండగా దాని విలువ రూ.26,750 ఉన్నట్లు తెలిపారు. పట్టుబడిని గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసును మంథని పోలీసులు విచారించగా మంథనికి చెందని పుల్లె ప్రశాంత్, భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మద్దెలపల్లికి చెందిన చికినారపు సంతోష్‌లను నిందితులుగా తేలిందన్నారు. వీరి పై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు. యువత మత్తు కోసం గంజాయి, మద్యం లాంటి వాటికి బానిసై తమ జీవితాలను నాశనం చేసుకొవ ద్దన్నారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లల కదలిక పై దృష్టి సారించాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై స్థానిక పోలీసులకు లేదా 100 డయల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. గంజాయి నిందితులను పట్టుకోవడంలో ప్రతిభను కనబర్చిన మంథని ఎస్ఐ వెంకటకృష్ణ, పీసీలు దుబ్బాసి రమేష్, ఐతు లూకాలను గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ ప్రత్యేకంగా అభినందించారు.

వరి కొయ్యలు కాల్చేందుకు వెళ్లి నిప్పంటుకొని వృద్ధుడి మృతి


భూమయ్య(ఫైల్)

రాయికల్, జూన్ 11: జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో వరి కొయ్యలను కాల్చేందుకు వెళ్లి నిప్పంటుకొని ఓ వృద్ధుడు మంగళవారం మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. రాయికల్ పట్టణానికి చెందిన రైతు తోపారపు నడిపి భూమయ్య(70) సోమవారం సాయంత్రం తన పంట పొలంలో వరి కొయ్యలను కాల్చేందుకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. వరి కొయ్యలకు నిప్పు పెట్టి అక్కడే ఉండగా కొయ్యలు కాలుతూ ప్రమాదవశాత్తు వృద్ధుడికి అంటుకోవడంతో శరీరం పూర్తిగా కాలిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంటి నుంచి వెళ్లిన భూమయ్య తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు మంగళవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

పరస్పర దాడులు.. నలుగురిపై కేసు

ఎల్లారెడ్డిపేట, జూన్11: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం లోని సాయిబాబా కమాన్ వద్ద ఇరు వర్గాలు పరస్పరం దాడులకు దిగి ప్రజలకు ఇబ్బందులు కలిగించిన సంఘటనలో నలుగురిపై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ మంగళవారం తెలిపారు. మండలంలోని రాజన్నపేట గ్రామానికి చెందిన నమిలికొండ బాలయ్య నమిలికొండ రాజవ్వ, నమిలికొండ పర్శయ్య, నమిలికొండ నిర్మల ఒకరిపై ఒకరు దాడులకు ఎగబడ్డారు. సమాచారం అందుకున్న హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసులు అక్కడకు చేరుకుని అడ్డుకునేందుకు యత్నించారు. ఎంత చెప్పినా వినకపోవడంతోపాటు రహదారిపై వెళ్లే ప్రజలకు ఇబ్బందులు కలిగించారు. హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి ఫిర్యాదుతో నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కల్యాణ కాత్యాయనీదేవి వ్రతం

మెట్‌పల్లి, జూన్, 11: పట్టణంలోని పెద్దమ్మ ఆలయంలో కాత్యాయదేవి కల్యాణవ్రతాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కొంగుబంగారంగా కొలిచే పెద్దమ్మ ఆలయంగా వెలి సిన బంగారు పెద్దమ్మ, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వ్రతాలను ఆలయంలో చేపట్టారు. ఉదయం నుంచి బంగారు తల్లి అమ్మవారికి, శ్రీవల్లి దేవి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు, లక్ష్మీదేవి పూజలు ఆలయ పురోహితుడు మదన్‌శర్మ నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులతో భక్తులు పెద్దమ్మ ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేశారు. సర్పదోష నివారణ, కల్యాణ, సంతాన దోషాల పరిహారం వంటి కార్యక్రమాలను చేయించారు. భక్తులు ఆలయం సమీపంలోని శ్రీ ఐశ్వర్యలక్ష్మీ, గోశాలలోని గోమాతలకు పూజలు చేశారు.


కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

ఘనంగా రేణుక ఎల్లమ్మ బోనాలు

మెట్‌పల్లి, జూన్ 11: పట్టణంలోని రేణుక ఎల్లమ్మ బోనాలు గౌడ కుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వ హించారు. ఆలయంలోని అమ్మవారికి అభిషేకాలు, అలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. బోనాల జాతరకు మెట్‌పల్లి చుట్టు పక్క గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రానావేణి సుజాత-సత్యనారాయణలు పాల్గొని అమ్మ వారికి ప్రత్యేక పూజలు జరిపారు. మహిళలు బోనం ఎత్తుకుని పట్టణంలోని చావిడి వద్ద ఉన్న భూమాత ఆలయం నుంచి డప్పు చప్పులతో శివసత్తుల పూనకంలో ఊరేగింపుగా ఆలయానికి తరలి వెళ్లారు. మాజీ ఎమ్మెల్యే భక్తులతో కలిసి బోనం నెత్తిన ఎత్తుకొని ఊరేగింపులో పాల్గొన్నారు. జాతరలో గౌడ శెట్టి, పంబాల పూజారుల ఎల్లమ్మ వేషధారణ, పోతురాజుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గౌడ కుల సంఘం అధ్యక్షుడు పూదరి సుధాకర్‌గౌడ్, పూదారి నర్సాగౌడ్, చెర్లపల్లి మీనా, చెర్లపల్లి సుఖేందర్‌గౌడ్, ఎనుగందుల శ్రీనివాస్, వనజ, చెర్లపల్లిలక్ష్మీ, రాజేశ్వర్‌గౌడ్, పుల్ల చిన్నయ్యగౌడ్, పూదరి శ్యాంసుందర్‌గౌడ్, పూదరి రామ్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, ఏనుగందుల గోపిగౌడ్, భక్తులు, కుల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారం గ్రామంలో రేణుక ఎల్లమ్మ బోనాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డోలు వాయిద్యాల మధ్య బోనాలతో మహిళలు గ్రామంలోని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. బోనాలు నెత్తిన పెట్టుకొని గ్రామ శివారులోని ఎల్లమ్మ గుడికి చేరుకొని బోనాలు, ఒడి బియ్యాన్ని సమర్పించారు. గ్రామస్థులు పెద్ద ఎత్తున తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పైడిపల్లి ఆనందం, కౌన్సిలర్ బొంగోని వీరన్న, ఆయోధ్య బుర్ర సంపత్, పైడిపల్లి మల్లిఖార్జున్, పొన్నం వెంకటరమణ, పైడిపల్లి పెద్ద భీమయ్య, బొంగోని సదానందం, పైడిపల్లి తిరుపతి, గట్టు సదయ్య, పంజాల రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.


మెట్‌పల్లిలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

భక్తులతో పోటెత్తిన కొండగట్టు

- ఇబ్బందులు కలుగకుండా అధికారుల చర్యలు


ఆలయ ఆవరణలో భక్తజనం

మల్యాల, జూన్ 11: కొండగట్టు ఆంజనేయస్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో పోటెత్తింది. వేలాదిగా భక్తులు వేకువజాము నుంచే స్వామి వారిని దర్శించుకోవడంకు బారులు తీరగా అంజన్నను దర్శించు కొని ప్రత్యేక పూజలు జరిపారు. స్వామి వారి దర్శనంకు గంట సేపు పైగా సమయం పట్టింది. విద్యార్థుల వేసవి సెలవులు ముగుస్తుండ డం తో తరలివచ్చిన భక్తులు అంజన్న దర్శనం అనంతరం బేతాళుడు, శ్రీరాముడిని కూడా దర్శించుకున్నారు. ఆలయంలో అభిషేకాలు, వ్రతాలు నిర్వహించారు. వై జంక్షన్ వద్ద వాహనాలతో భక్తుల రాకపోకలకు అసౌకర్యంగా మారింది. భక్తులు వచ్చిన వాహనాలతో ఘాట్‌రోడ్డు నిండిపోయింది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

క్రీడలతో దేహదారుఢ్యం పెంపొందుతుంది

-పీసెట్ కన్వీనర్ రాజేష్‌కుమార్



మాట్లాడుతున్న పీసెట్ కన్వీనర్ రాజేష్‌కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 11: క్రీడలతో దేహదారుఢ్యం, శారీరక పటుత్వం లభిస్తాయని ఫిజికల్ ఎడ్యుకేషనల్ కమాన్ ఎంట్రన్స్ టెస్ట్ (పీసెట్) కన్వీనర్ రాజేష్‌కుమార్ అన్నారు. శాతవాహన యూనివర్సిటీ మైదానంలో మంగళవారం తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్టు శారీరక పరీక్షలను రెండో రోజు ఆయన ప్రారంభించి మాట్లాడారు. 470మంది అభ్యర్థులు శారీరక సామర్థ్య పరీక్షలలో పాల్గొన్నారని తెలిపారు. అనంతరం హాజరైన అభ్యర్థులకు వంద మీటర్ల పరుగు, లాంగ్ జంప్, షాట్‌పుట్, హైజంప్‌లతో పాటు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్ క్రీడాంశాలలో నైపుణ్య పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ పీడీ జె ప్రభాకర్ రావు, శాతవాహన యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ డాక్టర్ నిజాముద్దీన్ మునవర్, శాతవాహన యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ విజయ్‌కుమార్, పీడీలు శ్రీధర్ రావు, నాగేశ్వర్‌రావు, బాలరాజు, పన్యాల శ్రీనాథ్‌రెడ్డి, రవీందర్, అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారుడు నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడలో యువకుడి హఠాన్మరణం

వేములవాడ టౌన్, జూన్ 11 : కుటుంబ సభ్యులతో కలిసి రాజన్న ఆలయానికి వచ్చి న ఓ యువకుడు తీవ్ర ఒత్తిడికి లోనైన హఠన్మారణం పొందిన సంఘటన వేములవాడ పట్టణంలో మంగళవారం విషాదాన్ని నింపింది. జనగామ జిల్లాకు చెందిన బొట్ల ఇస్తారి, లక్ష్మీ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం రాజన్న ఆలయానికి వచ్చారు. పెద్ద కుమారుడి కూతురి పుట్టు వెంట్రుకలు తీసి రాజన్నను దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం చిన్న కుమారుడు బొట్ల వినయ్‌కుమార్(24)కు ఛాతిలో నొప్పిగా ఉండడంతో గదిలోనే ఉంచి కుటుంబ సభ్యులు బద్ది పోచమ్మ దర్శనానికి వెళ్లారు. ఈ క్రమంలో ఛాతీలో నొప్పి కాస్త తీవ్రం కావడంతో మెడికల్ షాపునకు వెళ్లి ఓఆర్ఎస్ ప్యాకెట్ కొను గోలు చేసి వస్తుండగా అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. స్థానికుల సహాయంతో అంబులెన్స్‌లో ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే వినయ్ మృతి చెందినట్లు పేర్కొన్నారు.


వినయ్‌కుమార్(ఫైల్)

ముడుపుల సామగ్రి వేలం

మల్యాల, జూన్ 11: కొండగట్టులో ఇటీవల జరిగిన పెద్ద హనుమాన్ జయంత్యుత్సవాల సందర్భంగా దీక్షపరులు సమర్పించిన ముడుపుల సామగ్రికి దేవస్థానం అధికారులు మంగళవారం వేలం నిర్వహించారు. ఈ వేలంలో మిశ్రమ బియ్యం కిలో రూ.23 చొప్పున, ఇత్తడి గంటలు కిలోకి రూ.440 చొప్పున, ఎండు కుడుకలు కిలో రూ.70చొప్పున వేలంలో పాల్గొన వారు ధర నిర్ణయించడంతో వాటిని ఖరారు చేశారు. మాలలకు రూ. 3.66లక్షలు, కొబ్బరికాయలకు రూ.60వేలు పలికినట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు. ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సునీల్, చంద్రశేఖర్ ఆలయ అధికారులు తదితరులు ఈ వేలం కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో అందని సెల్ సేవలు !

● భక్తులకు అందుబాటులో బీఎస్ఎన్ఎల్ మాత్రమే
● ఉన్నతాధికారులకు విన్నవించినా స్పందన శూన్యం

మల్యాల, జూన్ 11: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో సెల్ సేవలు భక్తులకు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సెల్ కంపెనీలు కొండపైన సేవలు అందించకపోవడంతో అసౌకర్యానికి గురవుతున్నారు. అంజన్న దర్శనానికి గాను ఇక్కడకు నిత్యం వేలల్లో, ప్రతి మంగళ, శనివారాల్లో ఇరవై వేలకు పైగా హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా లక్షలాదిగా భక్తులు వస్తూంటారు. ఇక్కడ బీఎస్ఎన్ఎల్ సెల్‌వన్ తప్ప మిగితా కంపెనీల సెల్ సేవలు లేకపోవడంతో ఊసురుమంటున్నారు. కొండపైన గల బీఎస్ఎన్ఎల్ సేవలు కూడా అంతంతమాత్రమే కాగ రద్దీ రోజుల్లో సామర్థ్యం మించిపోవడంతో సేవలకు అంతరాయం ఏర్పడడంతో మరింత ఇబ్బంది పడుతున్నారు. ఈ రోజుల్లో ఉక్కువ మంది ప్రైవేట్ కంపెనీల సెల్‌సేవలు పొందుతుండగా ఇక్కడ వారికి సంబంధించిన ఎలాంటి సెల్‌సేవలు అందుబాటులో లేవు. దీంతో కొండపైకి వచ్చే భక్తుల సెల్‌ఫోన్‌లు ఇక్కడకు చేరుకోగానే మూగబోతున్నాయి. కొండపైన చిన్నారులు తప్పిపోయే సంఘటనలు, బంధువులు, కుటుంబసభ్యులు ఇతరాత్రా సమాచారం తెలుసుకోవడం భక్తులకు కష్టంగా మారింది.


కొండపైన ఉన్న సెల్‌వన్ టవర్

● సేవలన్నీ ఆన్‌లైన్.. సెల్ ఆఫ్‌లైన్

సెల్‌ఫోన్ ఆధారంగానే సేవలన్నీ ప్రజలకు అందుబాటులోకి రాగ కొండపై సెల్‌సేవలు లేకపోవడంతో దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఇక్కట్లు పడుతున్నారు. ఇక్కడకు మన రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వస్తుంటారు. ఈ మధ్య కాలంలో డబ్బుల చెల్లింపులు, ఇతరాత్ర లావాదేవీలు అంతా సెల్‌ఫోన్ ఇంటర్‌నెట్ నుంచే జరుగుతున్నాయి. నగదు లేకుండానే అన్ని జరుగుతుండగా కొండపైన కూడా భక్తులు దుకాణాలలో వస్తువులు, పూజసామగ్రి తదితర కొనుగోళ్లలో యూపీఐ పేమెంట్స్ చేస్తుంటారు. అయితే ఇక్కడ బీఎస్ఎన్ఎల్ మినహా మిగిత సెల్ సేవలు అందుబాటులో లేకపోవడంతో డబ్బుల కోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని సందర్భాల్లో భక్తులు సెల్ సిగ్నల్స్ కోసం, చెట్లు, బండరాళ్ల ఎక్కాల్సిన దుస్థితి నెలకొంది. సెల్‌సేవలు విస్తృతంగా భక్తులకు అందుబాటులోకి తీసుకురావడానికి అధి కారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

పొలం పనుల్లో అన్నదాతలు



దుక్కి దున్నుతున్న రైతు

కోనరావుపేట, జూన్ 11: వానాకాలం సీజన్ మొదలవడంతో అన్నదాతలు పొలం బాట పట్టారు. వానాకాలం సీజన్‌లో సాగు చేసే రైతులు తొలకరి జల్లు పడడంతో బిజీ బిజీగా మారారు. రైతులు తొలకరి జల్లులు పడడంతోనే పత్తి విత్తనాలు నాటుతున్నారు. మండలంలో ఎక్కువ శాతం పత్తి సాగు పైనే రైతులు వ్యవసాయం చేస్తారు. మండలంలో సుమారు 8 వేల ఎకరాల్లో పత్తి సాగు చేయడానికి రైతులు సిద్ధంగా ఉన్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. సుమారు 5 వేల ఎకరాల్లో వరి, 1100 ఎకరాల్లో మొక్కజొన్న, సుమారు 500 ఎకరాల్లో పప్పు దినుసుల సాగు చేయనున్నారు. కోనరావుపేట మండలంలో ఎక్కువ శాతం రైతులు వర్షాధార పంటలపైనే ఆధారపడి సాగు చేస్తున్నారు. ఈ సంవత్సరం వరుణుడు కరుణించి పంటలు పండాలని విత్తనాలు నాటే ముందు వనరుడికి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు.



విత్తనాలను నాటుతున్న రైతులు

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన

- బడిబాటలో ఉపాధ్యాయులు
- కొనసాగుతున్న కార్యక్రమం



బద్దనపల్లిలో బడిబాట

తంగళ్లపల్లి, జూన్ 11: తంగళ్లపల్లి మండలంలో పలు గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. బద్దనపల్లి గ్రామంలో జిల్లా చైల్డ్ హెల్ప్‌లైన్ కో ఆర్డినేటర్ ఎలగందుల పరమేశ్వర్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సెంటర్ 1 పరిధిలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న ఉచిత వసతులు, విద్య, భోజనం, దుస్తులు తదితర అంశాలను వివరించారు. కార్యక్రమాల్లో పాఠశాల హెచ్‌ఎం రాజు నాయక్, అంగన్‌వాడీ టీచర్ లత పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గుండారం, బొప్పాపూర్, గొల్లపల్లి, నారాయణపూర్ తదితర గ్రామాల్లో బడి బాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు మంగళ వారం కొనసాగించారు. ఆయా గ్రామాల్లో విద్యార్థులతో కలిసి ర్యాలీ తీశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరుతు గాలిపెల్లి గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు తల్లి దండ్రులను కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం తాళ్లపెల్లి, పత్తికుంటపలె, గాలిపెల్లి గ్రామాలలో ర్యాలీలు తీశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో సరైన వసతులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పావని, ఉపాధ్యాయులు నాగరాజు, సాంబశివుడు, సుజాత, స్రవంతి పాల్గొన్నారు..



ధర్మారంలో



గుండారంలో

కోనరావుపేట: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యను అందిస్తున్నామని మండల విద్యాధికారి దూస రఘుపతి అన్నారు. కోనరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం బడిబాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రైవేటు పాఠశాల దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం కొనసాగిస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు అత్యధిక మార్కులు సాధిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం అందించే పారితోషికాలు అందుతాయని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్, మధుకర్, కమలాకర్, చిరంజీవి, మోహినుద్దీన్, భాగ్యలక్ష్మి, స్వప్న పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ ప్రమోద్‌కు సన్మానం



ప్రమోద్‌ను సన్మానిస్తున్న మంత్రి, ప్రభుత్వ విప్

సిరిసిల్ల టౌన్, జూన్ 11 : సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ చొప్పదండి ప్రమోద్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సన్మానించారు. కాంగ్రెస్ మద్దతు అభ్యర్థిగా సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ డైరెక్టర్‌గా గెలుపొందిన ప్రమోద్ మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, నాయకులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల బకాయిలు విడుదల చేయాలి



పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ సర్పంచ్ శంకర్

ఎల్లారెడ్డిపేట, జూన్ 11 : గ్రామపంచాయతీల బకాయిలను విడుదల చేయాలని కోరుతూ పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్కకు ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట మాజీ సర్పంచ్‌శంకర్‌తోపాటు పలువురు మాజీ సర్పంచులు మంగళవారం హైదరాబాదులో వినతి పత్రం అందజేశారు. స్పందించిన మంత్రి సీతక్క బిల్లులు కేటాయించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు మంత్రి సీతక్కను సన్మా నించారు. గ్రామాల మాజీ సర్పంచులు, పలువురు నాయకులు ఉన్నారు.

ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించండి

సిరిసిల్ల టౌన్, జూన్ 11 : తనను నిర్బంధించి దాడి చేశారని, వారి నుంచి ప్రాణహాని ఉందని, ఎస్పీ తనకు రక్షణ కల్పించాలని సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి గూడెల్లి రాజ్‌కుమార్ కోరారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వ్యక్తిగతంగా అవసరం ఉండి మాదాసు నరేష్ వద్ద 2021లో రూ.8లక్షలు అప్పుగా తీసుకున్నానని, రియల్ ఎస్టేట్ పడిపోవడంతో స్థలాలు అమ్ముడుపోక గడువుకు డబ్బులు చెల్లించ లేక పోయానని తెలిపాడు. తొమ్మిది నెలల క్రితం అప్పు ఇచ్చిన మాదాస్ నరేష్‌తో పంచాయితీ జరిగిందని, ఆరు నెలల్లో ఇస్తానని ఒప్పందం అయ్యిందని పేర్కొన్నాడు. గడువులోగా డబ్బులు అందలేదని, నరేష్‌కు ఇవ్వ లేకపోయానని తెలిపాడు. మరింత గడువు ఇవ్వాలని కోరినట్లు చెప్పాడు. దీంతో మాదాస్ నరేష్, మాజీ కౌన్సిలర్ భర్త భీమారం శ్రీనివాస్ పట్టణ శివారులోని హెచ్‌పీ గ్యాస్ గోదాం వద్దకు మాట్లాడుకుందామని తనను తీసుకెళ్లారని, కట్టేసి అప్పు చెల్లించాలంటూ మారో ఐదుగురు వ్యక్తులతో కలసి కర్రలతో దాడి చేశారని వాపోయాడు. చంపుతామంటూ బెదిరించారని విలపించాడు. వారి నుంచి ప్రాణహాని ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పాడు. ఎస్పీ తనకు రక్షణ కల్పించాలని ప్రాధేయ పడ్డాడు. తనకు ఎలాంటి హాని జరిగినా మాదాసు నరేష్, భీమారం శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

నేడు 'చలో మన కరెంట్ ఆఫీసు'

ఎల్లారెడ్డిపేట, జూన్ 11: విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం బుధవారం నిర్వహించ తలపెట్టిన 'చలో మన కరెంటు ఆఫీసు' కార్యక్రమాన్ని వినియోగదారులు, రైతులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ నాయకుడు బాలరాజుయాదవ్ మంగళవారం కోరారు. పొలాల్లో వాలిన విద్యుత్ స్తంభాలు, కిందకు వేలాడుతున్న తీగలతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలతోపాటు హై ఓల్టేజీ, లో ఓల్టేజీ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లానున్నామన్నారు. 200 యూనిట్ల లోపు జీరో బిల్లు అందరికి వర్తించడం, గ్రామంలో 8 వేల విద్యుత్‌కనెక్షన్లు కనెక్షన్లు ఉన్న ఒక్క హెల్పర్ మాత్రమే విధులు నిర్వహించడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. సమస్యలను అధికారులకు వివరించేందుకు చేపట్టిన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బాలరాజుయాదవ్ కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

గంభీరావుపేట, జూన్ 11 : గంభీరావుపేట మండలం మల్లుపల్లెలో కొమ్ము లక్ష్మి అనే మానసిక వికలాంగురాలు ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబానికి గల్ఫ్ కార్మికులు రూ.13 వేలు సహాయం అందజేశారు. తమ చిన్న తనంలోనే తల్లిదండ్రులు చనిపోయారని, అప్పటి నుంచి మా అక్క కొమ్ము లక్ష్మి అన్ని తానై కుటుంబాన్ని పోషించిందని లక్ష్మి తమ్ముడు రమేష్ తెలిపాడు. కుటుంబంలో ఇద్దరు మానసిక, ఇద్దరు శారీరక వికలాంగులనిపేర్కొన్నాడు. ప్రతీ నెల ఆసుపత్రికి తీసుకెళ్లి చూపించడం, కుటుంబాన్ని పోషించడం చాల కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశాడు పాలకులు, అధికారులు స్పందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరాడు.

ప్రైవేటు పాఠశాలకు విద్యాశాఖ నోటీసులు

తంగళ్లపల్లి, జూన్ 11: తంగళ్లపల్లి మండల కేంద్రంలో శ్రీసరస్వతి పాఠశాల నిబంధనలు పాటించడం లేదంటూ డీఈవో రమేశ్‌కుమార్ మంగళవారం నోటీసులు జారీ చేశారు. నిబంధనల మేరకు సరస్వతి పాఠశాల ఫైర్ సేఫ్టీ రెన్యూవల్ చేయక పోవడంతో గతంలో పలుమార్లు నోటీసులు జారీ చేసినట్లు నోటీస్‌లో పేర్కొన్నారు. నోటిసులు ఇచ్చినా స్పందించక పోవడంతో పాఠశాల అనుమతిని ఎందుకు రద్దు చేయకూడదంటూ మంగళవారం డీఈవో నోటిస్ జారీ చేశారు.

బదిలీలు, పదోన్నతుల ప్రక్రియపై హర్షం



మాట్లాడుతున్న పాకాల శంకర్‌గౌడ్

సిరిసిల్ల రూరల్ జూన్ 11: ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విద్యా కమిషన్ ఏర్పాటు చేసి ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు చేపట్టడం హర్షనీయమని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు పాకాల శంకర్ గౌడ్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్ గౌడ్ మాట్లాడుతూ దశాబ్ద కాలంగా ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్న ప్రమోషన్లు, బదిలీల షెడ్యూల్ ప్రకటించడం, ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ కోసం విద్యా కమిషన్ ఏర్పాటు చేసి, సెమీ రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం హర్షనీయమన్నారు. గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా రాష్ట్ర వ్యాప్తంగా పదివేల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల పోస్టులను ఈ ప్రమోషన్ల షెడ్యూల్‌లోనే భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణ కోసం సర్వీస్ పర్సన్స్‌ను నియమించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, సీపీఎస్ రద్దు కోసం ప్రభుత్వం కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుండమనేని మహేందర్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు అంబటి రమేష్, జిల్లా కోశాధికారి పర్కాల రవీందర్, జిల్లా కార్యదర్శులు ఆడెపు శివకుమార్, జంగిటి రాజు బాధ్యులు లక్ష్మణ్, నరేష్, సతీష్ మొదలైన వారు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లంతకుంట, జూన్ 11: మండలంలోని రామోజిపేట గ్రామంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలంటూ గ్రామస్థులు మంగళవారం డీటీకి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డు స్థలాన్ని ఇదే గ్రామానికి చెందిన నాంపల్లి అనే వ్యక్తి తన స్థలం అంటూ చెత్తపోయకుండా అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. ఇదే కాకుండా మరికొంత మంది చెరువు శిఖం భూమిని ఆక్రమించుకున్నారని అధికారులు విచారణ జరిపి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

కొడిమ్యాలలో దొంగతనం

కొడిమ్యాల, జూన్ 11 : మండల కేంద్రంలోని నాగుల అఖిలకు చెందిన ఇంటిలో సోమవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు. ఎస్సై వివరాల మేరకు అఖిల గంగాధర మండలం సర్వారెడ్డిపల్లిలోని తల్లి గారింటికి వెళ్లిపోయింది. ఆమె అత్తమ్మ ఒక్కరు సొంత ఇంటికి తాళం వేసి పక్కన ఉన్న ఇంటిలో నిద్రించింది. మంగళవారం ఉదయం ఆమె అత్త ఇంటికి వచ్చి చూసే సరికి దొంగలు ఇంట్లోకి చొరబడ్డారు. ఇంటి తాళాలు, లోపల ఉన్న బీరువాను పగులగొట్టి అందులోని వస్తువులను చిందరవందర చేశారు. బీరువాలోని 2 తులాల బంగారు చైన్, 10 తులాల వెండి పట్టగొలుసులు, ఒక బ్రాస్‌లెట్, 50 వేల రూపాయల నగదును దొంగలు ఎత్తుకు పోయినట్లు బాధితురాలు తెలిపింది. బాధితులు అఖిల ఫిర్యాదుతో కేసు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పగటి పూట విద్యుత్ వెలుగులు



తిమ్మాపూర్‌లో వెలుగుతున్న దీపాలు

ఎల్లారెడ్డిపేట, జూన్ 11: ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్‌లో పగటిపూట విద్యుద్దీపాలు వెలుగుతున్నాయి. పంచాయతీ అధికారుల పర్యవేక్షణ కొరవడిందని, విద్యుత్ బకాయిలు పేరుకుపోయినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. విద్యుత్ దీపాలు ఉదయం, రాత్రి నిరంతరంగా వెలుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని, విద్యుత్‌ను ఆదా చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



టీపీటీఎఫ్ విద్యా సదస్సును విజయవంతం చేద్దాం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

సిరిసిల్ల రూరల్, జూన్ 11 : గజ్వేల్‌లో ఆదివారం నిర్వహించనున్న టీపీటీఎఫ్ విద్యాసదస్సును విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దోర్నాల భూపాల్‌రెడ్డి, దుమాల రామానాథ్‌రెడ్డి అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం టీపీటీఎఫ్ జిల్లా నాయకులతో కలిసి విద్యాసదస్సుకు సంబంధించిన కరపత్రాలు, పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీపీటీఎఫ్ అధికార మాస పత్రిక ప్రధాన సంపాదకుడు ప్రకాష్‌రావు పదవీ విరమణ సందర్భంగా గజ్వేల్‌లో విద్యాసదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి టీపీటీఎఫ్ సభ్యులు, ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు లాకావత్ మోతీలాల్, జిల్లా ఉపాధ్యక్షుడు పురం వాసుదేవరావు, మల్లారపు పురుషోత్తం, సత్తు రవీందర్, నాయకులు బస్సు రాజేందర్, మైలారం తిరుపతి, మహమూద్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌రాజు, చంద్రశేఖర్, రాంబాబు, శ్రీనవాస్, మధుసూదన్, నరేందర్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నిర్మాణం



స్థలాన్ని పరిశీలిస్తున్న వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్‌రెడ్డి

రుద్రంగి, జూన్ 11 : ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలు చేపడతామని వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వవిప్, వేములవాడ శాసన సభ్యుడు ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు రుద్రంగి మండల కేంద్రంలో మంగళవారం ఆయన పర్యటించారు. మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు, డిగ్రీ కళాశాల, సెస్ కార్యాలయం, సీతారామస్వామివారి ఆలయం, ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణాల కోసం ప్రభుత్వ స్థలాలను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆర్డీవో రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మండల కేంద్రంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు, ఆలయాల నిర్మాణాల కోసం ప్రభుత్వ స్థలాలను గుర్తించామన్నారు. ప్రభుత్వ స్థలాలను పూర్తి స్థాయిలో సర్వేచేసి అధికారులతో, నాయకులతో చర్చించి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేసేవిధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గట్ల మీనయ్య, చెలుకల తిరుపతి, ఎర్రం గంగ నర్సయ్య, గండి నారాయణ, పల్లి గంగాధర్, కొమిరె శంకర్, తర్రె లింగం, సూర యాదయ్య, ఆర్‌ఏ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులను నియంత్రించాలి



డీఈవోకు వినతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 11 : జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్న వాటిపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్ కుమార్, జిల్లా కన్వీనర్ అక్కేం నాగరాజు డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ ప్రైవేటు పాఠశాలలపైన కఠిన చర్యలు తీసుకోవాలని అనుమతులు లేకుండా నడుస్తున్న కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలలు విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పేరుతో అక్రమంగా అధిక ఫీజులు వసూలు చేసున్నారని మండిపడ్డారు. కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు లోపెల్లి రాజు, ఎనగందుల శ్రీనివాస్, అన్నల్‌దాస్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురిలో పెరిగిన భక్తుల రద్దీ

ధర్మపురి, జూన్ 11: ధర్మపురి క్షేత్రంలో మంగళవారం భక్తుల రద్దీ పెరిగింది. లక్ష్మీ నరసింహస్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. క్షేత్ర నలుమూలల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. గోదావరి నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి భక్తులు నేరుగా లక్ష్మీనృసింహస్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకున్నారు. స్వామి దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి ఆలయాల్లోకి ప్రవేశించారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కల్యాణం చేయించారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. కుబేరుడిని దర్శనం చేసుకున్నారు. అందంగా పూలతో స్వామి వారలను అలంకరించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామ వేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు చేశారు.

మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి



కలెక్టరట్ ఎదుట ధర్నాచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 11: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట మంగళవారం ఏఐటీయూసీ తెలంగాణ మధ్యాహ్నభోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నభోజన కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రాములు మాట్లాడుతూ మధ్యాహ్నభోజనం తయారు చేసే కార్మికలకు చెల్లించాల్సిన పెండింగ్ మెస్ బిల్లులను పెంచడంతోపాటు పెంచిన వేతనాలను సత్వరమే అందజేయాలని అన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ మేనిఫెస్టోలో మధ్యాహ్న భోజనం తయారీ కార్మికులకు రూ.10వేల వేతనం ఇస్తామని ఇచ్చిన హామీలను అముల చేయాలన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని, వంట తయారు చేసే పాత్రలను ఇవ్వాలని అన్నారు. వంట సరుకులతోపాటు గ్యాస్ సిలిండర్, కోడిగుడ్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని, లేకుంటే స్లాబ్ రేటు రూ.25 చెల్లించాలన్నారు. వయస్సు పైబడిన వారికి పదవీవిరమణ బెనిఫిట్ రూ.5లక్షలు చెల్లించాల న్నారు. ఎంఆర్‌వో ద్వారా వంట కార్మికులకు గుర్తింపు కార్డులను ఇవ్వాలన్నారు. కార్మికులకు సంవత్సరానికి రెండు జతల యూనిఫాం, రాగిజావ, అల్పాహారం అందించినందుకు అదనపు వేతనం చెల్లించాలన్నారు. ప్రమాద బీమా పథకాన్ని అమలు చేయాలన్నారు. మధ్యాహ్నభోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదని, కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలంటూ జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఇచ్చిన మాట ప్రకారం వెంటనే హామీలను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మీసం లక్ష్మణ్, జూబేదా, రజియాహసీనీబేగం, నర్సవ్వ, మానస, సరోజన, లావణ్య, లక్ష్మీ, పోచమ్మ, బాలలక్ష్మీ, మహేశ్వరీ, రేఖ, సాయిలు, మణెమ్మ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.